క్లుప్తంగా

వక్తృత్వ పోటీల్లో ప్రతిభ



సర్టిఫికెట్లు అందుకుంటున్న విద్యార్థులు

రాయదుర్గంటౌన్: జిల్లా కేంద్రంలో రోడ్డు భద్రతా మాసోత్సవాల ముగింపు సందర్భం శనివారం జరిగిన జిల్లా స్థాయి వక్తృత్వ పోటీల్లో రాయదుర్గం జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. సీఈసీ విద్యార్థి హారిక ద్వితీయ బహుమతి, ఒకేషనల్ ఎంఎల్‌టీ విద్యార్థి అరుణ్‌కుమార్ తృతీయ బహుమతి సాధించినట్లు ప్రిన్సిపాల్ విజయలక్ష్మి తెలిపారు.

శుభకార్యం



వధూవరులను ఆశీర్వదిస్తున్న అనంత

కణేకల్లు: వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మారెంపల్లి మారెన్న సోదరుడు నాగరాజు కూతురు సాయిప్రియ, సురేష్‌కుమార్ వివాహ రిసెప్షన్‌కు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకట్రామిరెడ్డి హాజరై, నూతన వధూవరులను ఆశీర్వదించారు. శనివారం స్థానిక కేసీఎస్ఆర్ పంక్షన్‌హాలులో సాయిప్రియ, సురేష్‌కుమార్ వివాహ రిసెప్షన్ జరిగింది. జిల్లా అధ్యక్షుడు అనంతతోపాటు వైఎస్సార్‌సీపీ జిల్లా కోశాధికారి పాటిల్ నాగిరెడ్డి, జెడ్పీ సభ్యులు డి.పద్మావతి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పాటిల్ బ్రహ్మానందరెడ్డి, మాజీ కన్వీనర్ ఆలూరు చిక్కన్న, నాయకులు కురుబ మల్లికార్జున, ఆర్కే బద్రీ, టీ.కేశవరెడ్డి, ఆదిసద్గురు చంద్రశేఖర్‌రెడ్డి, వేమన, హళ్లినాగరాజు, కెనిగుంట రామిరెడ్డి, రాజేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పెట్టుబడి తగ్గించుకోండి

కూడేరు: పంటల సాగులో రైతులు రసాయన ఎరువుల వాడకానికి స్వస్తి చెప్పి సేంద్రియ ఎరువులు వాడి పెట్టుబడి తగ్గించుకోవాలని ఎన్ఎఫ్ఏ జిల్లా కార్యదర్శి భానుమతి సూచించారు. శనివారం చోళసముద్రంలో వన్నూరప్ప అనే రైతు పొలంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో 20 రకాల జీవ వైవిధ్య పంటల విత్తనాలను బీజామృతంతో శుద్ధి చేయించి ఘన జీవామృతంతో విత్తనం వేయించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పంటలు సాగు చేసిన రైతు కుంటెన్న పొలాన్ని సందర్శించారు. కార్యక్రమంలో మండల సిబ్బంది వన్నూరప్ప, కుంటెన్న, కుళ్లాయప్ప, శివానంద, మహిళా సంఘ సభ్యులు పాల్గొన్నారు.

మారని ఉన్నతాధికారుల తీరు

కళ్యాణదుర్గం: ప్రభుత్వాలు మారినా విద్యారంగంపై ఉన్నతాధికారుల తీరుమారలేదని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి గొనిపాతిరెడ్డి అన్నారు. శనివారం పాఠశాల విద్యార్థులను 12గంటలకే ఇళ్లకు పంపి, ఉపాధ్యాయులకు క్లస్టర్ సమావేశాలు నిర్వహించడంపై వారు నిరసన తెలిపారు. క్లస్టర్ సమావేశాలను సాయంత్రం 5గంటలా ముప్పై నిమిషాల వరకు నిర్వహించారని, దీనివల్ల సుదూర ప్రాంతాలకు వెళ్లే ఉపాధ్యాయినులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని వారు నిరసన తెలియజేశారు. ఏపీటీఎఫ్ నాయకులు, క్లస్టర్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేషన్ షాపు ఆకస్మిక తనిఖీ

శెట్టూరు: మండలంలోని బచ్చేహళ్లిలో రేషన్‌షాపును ఆర్డీఓ వసంతబాబు ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామంలోని షాపు నంబర్ 1221007లో ఆర్డీఓ తనిఖీ చేశారు. ఎండీయూ వాహనంలో ప్రజలకు సరుకుల పంపిణీని పర్యవేక్షించారు. రేషన్ పంపిణీలో నిర్లక్ష్యం వహిస్తే డీలర్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తహసీల్దార్ ఈశ్వరయ్య శెట్టి, గ్రామ సచివాలయ సిబ్బంది, పంచాయతీరాజ్ సిబ్బంది పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి



మాట్లాడుతున్న కడప మలేరియా జోనల్ అధికారి లక్ష్మీనాయక్ తదితరులు

వజ్రకరూరు: వైద్యాధికారులు, వైద్యసిబ్బంది సమయపాలన పాటించాలని కడప మలేరియా జోనల్ అధికారి డాక్టర్ లక్ష్మీనాయక్ తెలిపారు. శనివారం మండలంలో కడప మలేరియా జోనల్ అధికారి లక్ష్మీనాయక్ పర్యటించారు. స్థానిక ప్రభుత్వాస్పత్రిని సందర్శించి, రికార్డులు పరిశీలించారు. అనంతరం ఆస్పత్రికి వస్తున్న రోగుల సంఖ్య, సేవలపై ఆరాతీశారు. కొనకొండ్ల గ్రామంలోని ఆస్పత్రిని సందర్శించి, రికార్డులను పరిశీలించారు. అనంతరం గ్రామంలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు తేజా ప్రతిమ, ప్రవీణ్‌కుమార్, తేజశ్వి, ఉరవకొండ మలేరియా సబ్‌యూనిట్ అధికారి కోదండరామిరెడ్డి, ఎంపీహెచ్ఈఓ గురుప్రసాద్, సూపర్‌వైజర్ నాగశంకర్ పాల్గొన్నారు.

శ్రీశైలానికి పాదయాత్ర

శెట్టూరు: లక్ష్మంపల్లి నుంచి శ్రీశైలానికి శివమాలధారులు పాదయాత్ర చేశారు. శనివారం గ్రామంలోని శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఇరుముడి కట్టుకొని పాదయాత్రగా బయల్దేరారు. సుమారు 13 రోజులు పాటు 410 కిలోమీటర్లు పాదయాత్రగా వెళ్లనున్నట్లు మాలధారులు తెలిపారు.

జిల్లాలోనే రెండేళ్ల నుంచి వరుసగా ఉత్తమ ఫలితాలు సాధించి, ఆదర్శంగా ఉన్న జూనియర్ కళాశాలలో సమస్యలు తిష్ట వేశాయి. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత నాడు- నేడు పనులు అర్ధంతరంగా నిలిపివేయడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. సరిపడా తరగతి గదులు లేవు. అవసరానికి మరుగుదొడ్లు లేవు. మధ్యాహ్న భోజన సమయంలో నీటి కోసం అవస్థలు పడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో విద్యార్థులకు తిప్పలు తప్పడంలేదు.

– బొమ్మనహాళ్:

ఫలితాల్లో ఆదర్శం..
సౌకర్యాల్లో అధమం



బొమ్మనహాళ్ జూనియర్ కళాశాల

- జూనియర్ కళాశాలలో సమస్యల తిష్ట
- అర్ధంతరంగా ఆగిన నాడు–నేడు పనులు
- సౌకర్యాలు లేక విద్యార్థులకు తప్పని తిప్పలు
- 300 మంది విద్యార్థినులకు ఒకే మరుగుదొడ్డి



అర్ధంతరంగా ఆగిపోయిన మరుగుదొడ్ల నిర్మాణం



అధ్వానంగా ఉన్న బాలికల మరుగు దొడ్డి



ధ్వంసమైన తాగునీటి కొళాయిలు

బొమ్మనహాళ్ మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 500 మంది వరకు విద్యార్థులు చదువుతున్నారు. వారిలో 300 మంది వరకు బాలికలు ఉన్నారు. కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా మరుగుదొడ్లు, తరగతి గదులు సరిపడా లేవు. తాగునీటి సౌకర్యం లేదు. జూనియర్ కళాశాలను 25 ఏళ్ల క్రితం ఆర్డీటీ ఆధ్వర్యంలో నిర్మించారు. సమీప గ్రామాల్లో 10వ తరగతి పూర్తి చేసిన నిరుపేద విద్యార్థులు ఈ జూనియర్ కళాశాలకే వస్తుంటారు. ఇక్కడ తాగునీటి వసతి లేదు. మధ్యాహ్న భోజనం తర్వాత చేతులు, ప్లేట్లు శుభ్రం చేసుకునేందుకు కూడా నీళ్లు లేవు. 300 మందికి పైగా విద్యార్థినులకు ఒకే మరుగుదొడ్డి ఉంది. వాటి తలుపులు కూడా లేవు. నీటి సౌకర్యం కూడా లేదు. దీంతో విద్యార్థినులు అసౌకర్యానికి గురవుతున్నారు. బాలురు మరుగుదొడ్డి లేక మల మూత్ర విసర్జనకు ఆరుబయటికి వెళ్లాల్సి వస్తోంది. అధ్యాపకుల కొరత వేధిస్తోంది. సివిక్స్, బాటనీ, జూవాలజీ, గణితం, కామర్స్ సబ్జెక్టులకు రెగ్యులర్ అధ్యాపకులు లేరు. కాంట్రాక్టు ప్రాతిపదికన నియమించి, పాఠాలు బోధిస్తున్నారు. 2022–23 సంవత్సరంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నాడు–నేడు కింద పాఠశాలకు రూ.55.73 లక్షలు మంజూరయ్యాయి. అందులో రూ.26 లక్షలు మంజూరు చేసి, మిగలిన మొత్తాన్ని సీపీపీ మెటీరియల్, డెస్కులు, ఫ్యాన్లు, విద్యుత్ సామగ్రి ప్రభుత్వమే కొనుగోలు చేసింది. బాలురు, బాలికలకు వేర్వేరుగా మరుగుదొడ్లు, మూత్రశాలల నిర్మాణం ఆగిపోయింది. సరిపడా గదులు లేక చెట్ల కింద చదువుకోవాల్సి వస్తోంది. తాగునీటి కొళాయిలు ధ్వంసమయ్యాయి. మధ్యాహ్న భోజన సమయంలో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. ఇంటి నుంచి బాటిళ్లలో నీరు తెచ్చుకోవాల్సి వస్తోంది. భోజన వసతి కూడాలేదు. తరగతి గదులు, వరండాల్లో మధ్యాహ్న భోజనం తినాల్సి వస్తోంది.

మరుగుదొడ్లు నిర్మించాలి



జూనియర్ కళాశాలలో మరుగుదొడ్ల కొరత కారణంగా చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. అధికారులు స్పందించి మరుగుదొడ్లను పూర్తి స్థాయిలో నిర్మించాలి. 300 మంది విద్యార్థినులకు ఒకే మరుగుదొడ్డి ఉంది. కళాశాలలో దెబ్బతిన్న తాగునీటి కొళాయికి మరమ్మతులు చేసి నీటి సౌకర్యం కల్పించాలి.

– లక్ష్మి, విద్యార్థిని, ద్వితీయ సంవత్సరం

చెట్ల కింద చదువుకుంటున్నాం..



విద్యార్థుల సంఖ్యకు తగ్గట్టుగా కళాశాలలో తరగతి గదులు లేవు. గదుల కొరత కారణంగా సరిగా చదువుకోలేక పోతున్నాం. తరగతి గదులు మరిన్ని నిర్మించాలి. గదులు కొరత ఉండడంతో చెట్ల కింద, వరండాల్లో చదువుకోవాల్సి వస్తోంది. అధికారులు ఇప్పటికైనా స్పందించి తమ సమస్యలను పరిష్కారించాలి.

– దివ్య, మొదటి సంవత్సరం విద్యార్థిని

మరో ఆరు గదులు అవసరం



కళాశాలలో ప్రస్తుతం ఉన్న విద్యార్థుల సంఖ్య బట్టి గదులు సరిపోవడం లేదు. మరో ఆరు గదులు అవసరమవుతాయి. మరుగుదొడ్ల సమస్య ఉందని అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. తాగునీటి సమస్య ఇబ్బంది అయితే లేదు. కొళాయిలు మాత్రమే అవసరం. ఆగిపోయిన పనులు పూర్తి చేయాలంటే కనీసం రూ.7 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు అవసరం ఉంది.

– మోహన్‌కుమార్, ప్రిన్సిపాల్, జూనియర్ కళాశాల

ఆగని ఇసుక, మట్టి అక్రమ రవాణా

డి హీరేహాళ్ (రాయదుర్గం): డీహీరేహాళ్ మండలంలో ఇసుక , మట్టి అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. అడ్డుకట్ట వేయాల్సిన అధికారులు చోద్యం చూస్తున్నారు. దీంతో అక్రమార్కులు బరితెగిస్తున్నారు. రోజంతా బాదనహాళ్ హగరితో పాటు వాగులు, వంకల్లోని ఇసుకను ట్రాక్టర్ల ద్వారా తరలించి, డంప్ చేస్తున్నారు. చీకటి పడగానే యథేచ్ఛగా జేసీబీ ద్వారా టిప్పర్లకు నింపి బళ్లారి, బెంగళూరు నగరాలకు తరలిస్తూ రూ.లక్షలు ఆర్జిస్తున్నారు.ఒక్కో టిప్పర్ ఇసుక రూ.50 వేలకు పైగా విక్రయిస్తున్నారు. పట్టపగలే ఇసుక లోడ్‌చేసే వీడియోలు వైరల్‌గా మారాయి. మడేనహళ్లి, లింగమ్మనహళ్లి, ఓబుళాపురం పరిసరాల్లో రెడ్ గ్రావెల్ భారీగా తరలిపోతుంది. రెండు రోజుల క్రితం పట్టుబడిన రెండు ట్రాక్టర్లపైనా పోలీసులు కేసులు నమోదు చేయకుండా వదిలేశారన్న విమర్శలు వస్తున్నాయి. ఒక్కో టిప్పర్ మట్టి రూ.12 వేల నుంచి రూ.15 వేలకు అమ్ముకుంటున్నట్టు తెలుస్తోంది. రూ.లక్షల్లో అవినీతి జరుగుతున్నా అధికారులు ఎందుకు అడ్డుకట్ట వేయడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కూటమి నాయకులే కొందరు అవినీతి, అక్రమాలను సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇసుక, మట్టి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయకపోతే ఆందోళనలు చేపడతామని ప్రజలు హెచ్చరిస్తున్నారు.



ఓబుళాపురం వద్ద ఏర్పాటు చేసిన ఇసుక డంప్

అవసరాలకు మాత్రమే అనుమతి

ఇసుక అవసరాలకు మాత్రమే అనుమతిస్తున్నాం. సరిహద్దు దాటనీకుండా పటిష్ట చర్యలు చేపడతాం. ఇసుక, మట్టి తరలిపోకుండా నిఘా ఏర్పాటు చేస్తాం. అక్రమ రవాణాలో ఎవరి ప్రమేయం ఉన్నా వదిలిపెట్టేది లేదు. అనుమతిలేకుండా ఇసుక, మట్టితో టిప్పర్లలో తరలిస్తూ పట్టుబడితే సీజ్‌చేసి కేసులు నమోదు చేస్తాం.

– గురుప్రసాద్‌రెడ్డి, ఎస్ఐ, డీహీరేహాళ్

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

ఉరవకొండ: సెల్‌ఫోన్‌ల ద్వారా సైబర్ నేరగాళ్లు పాల్పడుతున్న మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అర్బన్ సీఐ మహానంది, ఎస్ఐ జనార్దన్‌నాయుడు పిలుపు నిచ్చారు. శనివారం ఉరవకొండలో ఆటోల ద్వారా సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. పట్టణంలో ఆటోల ద్వారా ప్రచారం చేశారు.

రాయదుర్గంటౌన్: సైబర్ నేరాలపై ప్రజలకు అర్బన్ సీఐ జయానాయక్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. శనివారం రాయదుర్గంలో ఆటోలో ప్రచారం కల్పించారు. పోలీసుశాఖ రూపొందించిన ఆడియో ద్వారా ఆటోలు ప్రచారం చేయించి, ప్రజలను చైతన్యపరుస్తున్నారు. సీఐ మాట్లాడుతూ సైబర్ మోసాలకు గురైనా, అలాంటి కాల్స్ పట్ల అనుమానం ఉంటే వెంటనే 1930కి కాల్ చేయాలని సూచించారు.



ఉరవకొండలో అవగాహన కల్పిస్తున్న పోలీసులు

వైభవంగా ఆంజనేయస్వామి రథోత్సవం



అలంకరణలో ఆంజనేయస్వామి



బూదిగుమ్మ ఆంజనేయస్వామి రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

బొమ్మనహాళ్‌కు? — బెళుగుప్ప: మండల పరిధిలోని పెన్నానది పరీవాహక ప్రాంతంలో వెలసిన బూదిగుమ్మ క్షేత్రంలో ఆంజనేయస్వామి రథోత్సవం శనివారం వైభవంగా జరిగింది. ముందుగా పల్లకీ సేవ పూజలు నిర్వహించారు. అనంతరం బూదిగుమ్మ హనుమంతరాయస్వామి రథానికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులతో కలిసి రథాన్ని లాగారు. ఎస్ఐ శివ, ఏఎస్ఐ రామదాసు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఆదివారం ఉదయం గంగాహారతి తిరునాల జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు, దేవదాయశాఖ అధికారులు తెలిపారు.

లింగ నిర్ధారణ చేస్తే చర్యలు

కళ్యాణదుర్గం రూరల్: లింగ నిర్ధారణ చేస్తే చర్యలు తప్పవని ఆర్డీఓ వసంత్‌బాబు హెచ్చరించారు. శనివారం ఆర్డీఓ కార్యాలయంలో వైద్యులతో సమావేశం నిర్వహించారు. ఆర్డీఓ మాట్లాడుతూ స్కానింగ్ సెంటర్లలో లింగ నిర్ధారణ చేయడం చట్టరీత్యా నేరమన్నారు. మెడికల్ షాప్‌ల్లో డాక్టర్ల చీటిలేకుండానే గర్భనిరోధక మందులు ఇవ్వకూడదన్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, కేజీబీవీలు, ప్రైవేట్, విద్యాసంస్థల్లో గర్భస్థ లింగ నిర్ధారణ నిషేధిత చట్టంపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో సీడీపీఓ లక్ష్మీ ప్రసన్న, వైద్యులు రాజేష్, జమీల, శ్రీనివాసరెడ్డి, స్వప్న పాల్గొన్నారు.

ప్రారంభమైన ఇంటర్ ప్రాక్టికల్స్

కణేకల్లు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఇంటర్మీడియట్ ప్రాక్టికల్స్ శనివారం ప్రారంభమయ్యాయి. జూనియర్ కాలేజీ, మోడల్ స్కూల్, గురుకుల పాఠశాల విద్యార్థులకు జూనియర్ కళాశాలలో ప్రాక్టికల్స్ నిర్వహించారు. ఉదయం బాటనీ, జువాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టులకు నిర్వహించిన ప్రాక్టికల్స్‌కు 80 మంది విద్యార్థులు హాజరైనట్లు ప్రిన్సిపాల్ ఆంజనేయులు తెలిపారు. ఒకేషనల్ కోర్స్ ప్రాక్టికల్స్‌కు 32 మందికి 31 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం జువాలజీ, బా టనీ, ఫిజిక్స్ ప్రాక్టికల్స్‌కు 29 మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు. ఎగ్జామినేషన్ కమిటీ మెంబర్లు నాగరత్నమ్మ, వెంకటస్వామి ప్రాక్టికల్స్ కేంద్రాన్ని తనిఖీ చేశా రు. పరిశీలకులు మంజునాథ్, వీణ, రేఖ, రాజేష్ పాల్గొన్నారు.

అనారోగ్యంతో గొల్ల మారెక్క మృతి

రాయదుర్గం: వైఎస్సార్‌సీపీ వలంటరీ కమిటీ నియోజకవర్గ అధ్యక్షుడు గొల్ల మురారి తల్లి మారెక్క (82) అనారోగ్యంతో శనివారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మెట్టు గోవింద రెడ్డి ఫోన్‌లో మురారీని పరామర్శించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రాయంపల్లి రామాంజనేయులు, మైనార్టీ అధ్యక్షుడు దిలవర్ బాషా, కెంచానపల్లి సర్పంచ్ బుజ్జి, నాయకులు మలకాపురం గోపాల్, గొల్లలదొడ్డి గోవర్ధన తదితరులు మారెక్క మృతదేహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

- కళ్యాణదుర్గం ఆర్డీఓ వసంతబాబు

కళ్యాణదుర్గం: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుందామని ఆర్డీఓ వసంతబాబు తెలిపారు. ప్రతి మూడో శనివారం స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా కార్యాలయ పరిసరాలను శుభ్రం చేయించారు. ఆవరణలో ఉన్న మొక్కలకు ఆర్డీఓ పార పట్టి స్వయంగా పాదులు చేశారు. అనంతరం స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

చెత్త రహిత రాయదుర్గంగా మారుద్దాం

రాయదుర్గంటౌన్: అందరి సహకారంతో చెత్త రహిత రాయదుర్గంగా మారుద్దామని మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, కమిషనర్ దివాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలో స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా తడి, పొడి చెత్త నిర్వహణపై కాలనీల్లో మహిళలకు అవగాహన కల్పించారు. మున్సిపల్ చైర్‌పర్సన్, కమిషనర్, వార్డు కౌన్సిలర్ ప్రశాంతి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కౌన్సిలర్లు, మున్సిపల్, సచివాలయ సిబ్బంది, ఆర్‌పీలు పాల్గొన్నారు.

శెట్టూరు: మన పరిసరాలు శుభ్రంగా ఉంచుకుంటేనే ఆరోగ్యంగా ఉండొచ్చని మండల ప్రత్యేక అధికారి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సురేష్ తెలిపారు. శనివారం యాటకల్లులో సర్పంచ్ ఈరన్నతో కలిసి స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. శెట్టూరు, అయ్యగార్లపల్లి, ములకలేడు, కనుకూరు గ్రామాల్లో పరిసరాలను శుభ్రం చేయించారు. ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రఘురాంరావు, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది,అధికారులు పాల్గొన్నారు.

గుమ్మఘట్ట: పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం పదిలంగా ఉంటుందని పంచాయతీ కార్యదర్శులు తెలిపారు. శనివారం మండలంలోని గ్రామ సచివాలయాల పరిధిలో స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శులు వేణుగోపాల్‌రెడ్డి, కొల్లప్ప,హేమంతరాజు పాల్గొన్నారు.



కళ్యాణదుర్గంలో మొక్కలకు పాదులు చేస్తున్న ఆర్డీఓ వసంతబాబు



రాయదుర్గంలో తడి, పొడి చెత్తపై మహిళలకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

కళ్యాణదుర్గం రూరల్: మున్సిపాలిటీలోని ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ ఇన్‌చార్జ్ కమిషనర్ అశ్వర్థనారాయణ సూచించారు. శనివారం మున్సిపాలిటీలో, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జయరాంరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ శేషయ్య, ఎన్ఎస్ఎస్ పీఓ శ్రీధర్, అధికారులు, కార్మికులు పాల్గొన్నారు.

కూడేరు:పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత అందిరిపైనా ఉందని ఎంపీడీఓ కుళ్లాయిస్వామి తెలిపారు. శనివారం మండల కేంద్రంలో 'స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్' లో భాగంగా హైస్కూల్ విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. కార్మికులకు గ్లౌజ్‌లు, దుస్తులు అందించారు. ఇప్పేరులో సీడీపీఓ శ్రీదేవి ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. సర్పంచులు లలితమ్మ, ఓబులేసు, ఈఓఆర్డీ రాధాకృష్ణ, ఏపీఓ తులసీప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు రమాదేవి, పావని, మహిళా పోలీస్ వెంకటరమణమ్మ, పుష్పా, మాధవి, హెచ్ఎం శ్రీదేవి పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

ఉరవకొండ: ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ నిషేధానికి సహకరించి, పర్యావరణాన్ని కాపాడుకుందామని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.రామకృష్ణ తెలిపారు. శనివారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలతో పాటు ఉరవకొండ మేజర్ పంచాయతీ కార్యాలయంలో స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈఓఆర్డీ సతీష్‌కుమార్, ఎంఈఓ ఈశ్వరప్ప ఆధ్వర్యంలో ర్యాలీ, మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ మస్తానప్ప, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ వెంకటరాముడు, పరమేష్, పీడీ ప్రశాంత్, అధ్యాపకులు ఆదినారాయణ, కృష్ణవేణి పాల్గొన్నారు.

మైలారలింగేశ్వరస్వామి గంగపూజ



గంగపూజకు తరలివెళ్తున్న భక్తులు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని అంబేడ్కర్ నగర్ క్రాస్1లో వెలసిన మైలారలింగస్వామి నూతన ఆలయం, విగ్రహ ప్రతిష్టాపనోత్సవంలో భాగంగా శనివారం స్వామి గంగపూజ చేశారు. ఉదయం ఆలయంలో హోమాలు, నూతన విగ్రహాలకు పూజలు చేశారు. వందలాది భక్తులు కలశాలతో ఆలయం వద్ద నుంచి 28వ వార్డులోని పాలబావి వద్దకు గంగపూజకు తరలివెళ్లారు. మైలార, దేవరకొండ నుంచి వచ్చిన వగ్గప్పలు అనందప్ప, సంగన్న, కెంచప్ప, మల్లేశప్ప, సంగన్న, రవి, బసవం తప్పలచే పాల బావి నందు నూతన విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేయించారు. ఆదివారం నూతన విగ్రహాల ప్రతిష్టాపన పూజ ఉంటుందని కమిటీ నిర్వాహకులు తెలిపారు.

హెల్మెట్ తప్పక ధరించాలి



జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల ర్యాలీని ప్రారంభిస్తున్న ఎంవీఐ శ్వేతబిందు

కళ్యాణదుర్గం రూరల్: ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ శ్వేత బిందు, పట్టణ సీఐ యువరాజ్ తెలిపారు. శనివారం రోడ్డు భద్రత, హెల్మెట్ వాడకంపై ప్రజలకు అవగాహన కల్పించడంలో భాగంగా పట్టణ పోలీస్ స్టేషన్ నుంచి పోలీసులు ర్యాలీ చేశారు.

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి తీరని ద్రోహం



రాయదుర్గంలో నిరసన ర్యాలీ చేస్తున్న దృశ్యం

రాయదుర్గంటౌన్: కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు ద్రోహం జరిగిందని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు మల్లికార్జున అన్నారు. సీపీఎం అధిష్టానం పిలుపు మేరకు శనివారం పట్టణంలో సీపీఎం నాయకులు, కార్యకర్తలు నిరసన తెలియజేశారు. కార్యక్రమంలో సీపీఎం సీనియర్ నాయకుడు నాగరాజు, ప్రాంతీయ కమిటీ సభ్యుడు మధు, తిమ్మరాజు, కృష్ణ నాయక్, ఆంజనేయులు, తిప్పేస్వామి, ఎస్ఎఫ్ఐ పట్ట కార్యదర్శి వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బాలికల రక్షణ అందరి బాధ్యత



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

బొమ్మనహాళ్: బాలికల రక్షణను అందరూ బాధ్యతగా భావించాలని చైల్డ్ హెల్ప్‌లైన్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ కృష్ణమాచారి, కణేకల్లు సీడీపీఓ లక్ష్మీప్రసన్న తెలిపారు. మండలంలోని కేజీబీవీ స్కూల్‌తోపాటు ఉద్దేహాళ్, దర్గాహొన్నూరు, గోవిందవాడ జెడ్పీహైస్కూల్‌లో బాలికల రక్షణపై అవగాహన కల్పించారు. మిషన్ శక్తి కిశోరి వికాసం–2 భాగంగా అనంత బాలికల రక్షణ కార్యక్రమం నిర్వహించారు. కౌమార దశలో ఉన్న బాలికలు తీసుకోవల్సిన జాగ్రత్తలపై బాలికలకు వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కమలమ్మ, సూపర్‌వైజర్లు శాంతకుమారి, ఈశ్వరమ్మ, అంజనమ్మ, కరాటే మాస్టర్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విశ్వభారతి పాఠశాల రిజిస్ట్రేషన్ శాశ్వతంగా రద్దు

రాయదుర్గంటౌన్: కొలిమివీధిలోని విశ్వభారతి ఇంగ్లిష్ మీడియం పాఠశాల రిజిస్ట్రేషన్‌ను యాజమాన్యం సిఫార్సు మేరకు శాశ్వతంగా రద్దు చేసినట్లు ఎంఈఓ నాగమణి శనివారం తెలిపారు. విశ్వభారతి ఎడ్యుకేషనల్ సొసైటీ వారు వ్యక్తిగత, ఆర్థిక ఇబ్బందుల కారణాలతో పాఠశాలను మూసివేయనున్నట్లు అర్జీ ఇచ్చినట్లు చెప్పారు. విద్యార్థులు సర్టిఫికెట్ల కోసం తమ కార్యాలయంలో సంప్రదించాలని ఆమె తెలిపారు.